# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ బుధవారం 26 ఫిబ్రవరి 2025 | www.balagamtv.com | పేజీలు 4





పాఠకులు, ప్రకటనకర్తలు, ఏజెంట్లు, శ్రేయోభిలాషులకు
మహాశివరాత్రి శుభాకాంక్షలు
- బలగం టీవి సీఈఓ బాలు కాయితీ




# తెలంగాణలో లైఫ్ సైన్సెస్ పాలసీ

- దేశంలోనే ఇది మొట్టమొదటిది
- త్వరలో 10 ఫార్మా విలేజీల ఏర్పాటు
- 5లక్షల మందికి కొత్తగా ఉద్యోగాలు
- ఎంఎస్ఎంఈలను ప్రోత్సహిస్తాం
- హైదరాబాద్ కేంద్రంగా ప్రముఖ కంపెనీల కార్యకలాపాలు
- రాష్ట్రంలో మెగా డ్రైపోర్ట్ ఏర్పాటు
- ఏపీలోని సీ పోర్ట్‌తో అనుసంధానం :
- బయో ఆసియా సదస్సులో సీఎం రేవంత్‌రెడ్డి

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణలో దేశంలోనే మొట్టమొదటి "లైఫ్ సైన్సెస్ పాలసీ"ని తీసుకురానున్నట్టు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రకటించారు. తెలంగాణలో దేశ విదేశాల పెట్టుబడులకు సులభతరమైన పారిశ్రామిక విధానం, అవసరమైన మౌలిక సదుపాయలు కల్పన, అందుకు అనుగుణమైన పాలసీ, తగిన సహకారాన్ని అందించడంలో ప్రభుత్వం ఒక స్పష్టమైన విధానంతో ముందుకు వెళుతుందని చెప్పారు. హైదరాబాద్ హెచ్ఐసీసీలో ప్రతిష్టాత్మకమైన 'బయో ఆసియా -2025' రెండు రోజుల సదస్సును ముఖ్యమంత్రి గారు ప్రారంభించారు. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబుతో కలిసి పాల్గొన్న ఈ ప్రతిష్టాత్మకమైన సదస్సుకు ప్రపంచ దిగ్గజ కంపెనీల ప్రతినిధులు, దేశీయ సంస్థలతో పాటు ఆ రంగంలో నిపుణులు, నిష్ణాతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, "బయో ఆసియా సదస్సు హైదరాబాద్ ను ప్రపంచ లైఫ్‌సైన్సెస్ రాజధానిగా మార్చింది. ఫార్మా, ఐటీ, డిజిటల్ హెల్త్ రంగాల్లో గడిచిన 25 ఏళ్లగా హైదరాబాద్ ను ఒక పవర్ హౌజ్‌గా నిలబెట్టింది. ప్రపంచంలో పేరొందిన ఫార్మా, హెల్త్ కేర్, లైఫ్ సైన్సెస్, బయోటెక్ కంపెనీలు ఎన్నో హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్నాయి. బయో సైన్సెస్‌లో పరిశోధనలు, సరికొత్త ఆవిష్కరణలను ప్రోత్సహించాలన్న దార్శనితతో ప్రభుత్వం ముందునుంచి పనిచేస్తోంది.

జీనోమ్ వ్యాలీని ఏర్పాటు చేసుకున్నాం. హెల్త్‌కేర్ రంగం భవిష్యత్తును నిర్దేశించడంతో పాటు ప్రపంచానికి మార్గదర్శనం చేసే కార్యక్రమంగా బయో ఆసియా దేశవిదేశాలను ఆకర్షిస్తోంది. తెలంగాణలో ఉన్న అనుకూలతలు, ప్రభుత్వ సహకారాన్ని అందిపుచ్చుకోవాలని, ప్రభుత్వ భాగస్వామ్యంతో ప్రపంచ స్థాయి దిగ్గజ కంపెనీలకు ఆహ్వానం పలుకుతున్నాం. నిన్ననే ఆమ్‌జెన్ కంపెనీ హైదరాబాద్‌లో తన కార్యకలాపాలను విస్తరించింది. ప్రభుత్వ సహకారానికి ఇది నిదర్శనం.

జర్మనీ కంపెనీ మిల్టెని బయోటెక్ జీనోమ్ వ్యాలీ లో తన సెల్, జన్యు చికిత్సను ప్రారంభించింది. ఈ వేదికపై మరో 4 బహుళజాతి కంపెనీలను తెలంగాణ పర్యావరణ వ్యవస్థలోకి స్వాగతిస్తున్నాం. గతేడాది ఏఐ హెల్త్‌కేర్ సదస్సును కూడా విజయవంతంగా నిర్వహించాం.దేశ విదేశాల నుంచి పెట్టుబడులను ఆకర్షించడంలో భారతదేశంలో తెలంగాణ మొదటి స్థానంలో ఉంది. ఈ రాష్ట్రంలో అత్యల్ప ద్రవ్యోల్బణం, అత్యధిక ఉద్యోగాల కల్పన ఉంది. ఇటీవల దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక వేదికలో తెలంగాణ రూ.1.78 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించింది. విభిన్న రంగాలలో దాదాపు 50,000 ఉద్యోగాలు రానున్నాయి. అలాగే, గతేడాది లైఫ్ సైన్సెస్ రంగంలో రూ. 40,000 కోట్లకు పైగా పెట్టుబడులను విజయవంతంగా ఆకర్షించాం. దాదాపు 150 పైగా ప్రాజెక్టుల్లో ఈ పెట్టుబడులు విస్తరించాయి.

ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్ మధ్య ప్రాంతంలో మాన్యుఫాక్చరింగ్ హబ్‌గా, ఫార్మా క్లస్టర్స్ అభివృద్ధి చేస్తున్నాం. తద్వారా 5 లక్షలకు పైగా కొత్త ఉద్యోగాలను సృష్టించాలన్నది ప్రభుత్వ లక్ష్యం. ఫ్యూచర్ సిటీ ప్రాజెక్ట్‌లో భాగంగా గ్రీన్ ఫార్మా సిటీ వేగంగా అభివృద్ధి చెందుతోంది. అతిపెద్ద ఫార్మాస్యూటికల్ కంపెనీలు అవగాహన ఒప్పందాలపై సంతకం చేశాయి. వచ్చే పదేళ్లలో తెలంగాణ 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే కాకుండా చైనా ప్లస్ వన్ ఆలోచనలకు సరైన ప్రత్యామ్నాయ కేంద్రంగా తెలంగాణను అభివృద్ధి చేస్తున్నాం. నెట్ జీరో సిటీ కింద అనేక లక్ష్యాలను నిర్దేశించాం.

దేశ విదేశాల నుంచి బయో ఆసియా సదస్సుకు హాజరైన ప్రతినిధులందరికీ అభినందనలు. మీరంతా పెట్టుబడులకు తెలంగాణ అనువైన వేదికగా అవకాశాలను ఉపయోగించుకుంటారని ఆశిస్తున్నాం". అని ముఖ్యమంత్రి గారు సదస్సును ఉద్దేశించి వివరించారు. ఈ వేదికగా జినోమ్ వ్యాలీ ఎక్సలెన్స్ అవార్డ్ 2025 ను ముఖ్యమంత్రి గారి చేతుల మీదుగా ప్రిసిషన్ హెల్త్ రీసెర్చ్ (ప్రిసైజ్) సింగపూర్ కంపెనీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రొ. పాట్రిక్ టాన్‌కు బహూకరించారు. ప్రారంభ సదస్సులో మంత్రి శ్రీధర్ బాబు గారు, క్విన్స్ ల్యాండ్ స్టేట్ గవర్నర్ డాక్టర్ జెన్నెట్ యంగ్‌తో పాటు ఇతర ప్రముఖులు పాల్గొని ప్రసంగించారు.

## పాఠశాలల్లో తెలుగు తప్పనిసరి

- ఆదేశాలు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పాఠశాలల్లో తెలుగు సబ్జెక్ట్‌ను తప్పనిసరిగా బోధించాలని డిసైడ్ చేసింది. సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ, ఐబీ సహా ఇతర బోర్డు పాఠశాలల్లో అమలు చేయాలని ఆదేశించింది. తెలుగును తప్పనిసరి సబ్జెక్ట్‌గా అమలు చేసేందుకు విద్యాశాఖకు అనుమతి ఇచ్చింది. తెలుగును తప్పనిసరి సబ్జెక్ట్‌గా పేర్కొంటూ ఉత్తర్వులు జారీ చేసింది. 9వ తరగతి వారికి 2025-26 విద్యా సంవత్సరం నుంచి, పదో తరగతికి 2026-27 విద్యా సంవత్సరం నుంచి అమలు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొంది.

## మార్చి 1 నుంచి
# కొత్త రేషన్ కార్డులు

- ముందుగా హైదరాబాద్, ఉమ్మడి రంగా రెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో పంపిణీ
- మార్చి 8 తర్వాత మిగితా జిల్లాల్లో..

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**



తెలంగాణలో ఈ ఏడాది మార్చి ఒకటి నుంచి కొత్త రేషన్ కార్డులు జారీ చేయనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. మార్చి ఒకటిన ఒకే రోజు లక్ష కార్డులు జారీ చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. ఈ మేరకు హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి, మహబూబ్ నగర్ జిల్లాల్లో లక్ష కార్డులను అధికారులు పంపిణీ చేయను న్నారు. మార్చి 1న హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో పంపిణీ చేపట్టాలని ప్రభుత్వం తాజాగా డిసైడ్ అయింది. మార్చి 1వ తేదీన ఒకేసారి లక్ష కొత్త రేషన్ కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేయనుంది. వచ్చే నెల 1న మూడు జిల్లాల పరిధిలో దాదాపు లక్ష మందికి పైగా కొత్తగా రేషన్‌కార్డులు ఇవ్వనున్నారు. కొత్త జిల్లాల ప్రకారంగా వికారాబాద్ జిల్లాలో ఇరవై రెండు వేలు, నాగర్‌కర్నూల్ జిల్లాలో 15 వేలు, వనపర్తి జిల్లాలో 6 వేలు, నారాయణపేట జిల్లాలో 12 వేలు, మహబూబ్‌నగర్ జిల్లాలో 13 వేలు, గద్వాల జిల్లాలో 13 వేలు, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో 6 వేలు, రంగారెడ్డి జిల్లాలో 24 వేలు, హైదరాబాద్ నగరంలో 285 మందిని లబ్ధిదారులుగా ఎంపిక చేసినట్లు సమాచారం.

రాష్ట్రంలోని ఉమ్మడి ఏడు(మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్, ఖమ్మం, వరంగల్, నల్గొండ) జిల్లాల్లో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉండటంతో, ప్రస్తుతానికి ఈ మూడు(హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి, మహబూబ్‌నగర్ ) జిల్లాల్లో కొత్త కార్డుల పంపిణీకి సర్కార్ సిద్ధమైంది. మార్చి 8 తరవాత మిగతా జిల్లాల్లోనూ కొత్త కార్డుల జారీ ప్రక్రియ ఉంటుందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఈ మేరకు పోస్ట్ చేశారు.

## ప్రమాదంపై జ్యుడిషీయల్ కమిషన్ ఏర్పాటు చేయాలి

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

ఎస్ఎల్‌బీసీ సొరంగ ప్రమాదంపై జ్యుడిషీయల్ కమిషన్ ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. ఒకవైపు సహాయక చర్యలను మరింత వేగవంతంగా కొనసాగిస్తూనే జరిగిన ప్రమాదంపైన అందుకు బాధ్యులైన వారిపైన విచారణ చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ "కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో ప్రాజెక్టుల్లో వరుసగా ప్రమాదాలు జరుగుతున్నాయి. తాజా ఎస్ఎల్‌బీసీ సొరంగ ప్రమాదం వల్ల ప్రభుత్వానికి వందల కోట్ల రూపాయల ఆర్థిక నష్టం జరిగింది. ఇంతకు ముందు సుంకిశాల, పెద్దవాగు ప్రమాదాలు జరిగినప్పుడు కూడా ప్రభుత్వం ఎలాంటి దర్యాప్తు చేయలేదు, బాధ్యులపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఈ ప్రమాదాలపై హైకోర్టు న్యాయమూర్తి ఆధ్వర్యంలో న్యాయ కమీషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఏర్పాటు చేయాలి. గతంలో ఇదే కాంగ్రెస్ పార్టీ నేతలు, ముఖ్యమంత్రి సహా, అనేక అంశాలపై న్యాయ కమీషన్‌ల ఏర్పాటు కోసం డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా అనేక న్యాయ కమీషన్‌లు ఏర్పాటు చేశారు" అని కేటీఆర్ గుర్తు చేశారు. తాజా ప్రమాదాలపై న్యాయ కమీషన్‌ను వెంటనే ఏర్పాటు చేయాలని మేము మా పార్టీ తరపున ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు.. కేంద్ర ప్రభుత్వ సహాయంతో ఆర్మీ, ఇతర సంస్థల సహాయంతోఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదంలో చిక్కుకున్న వారిని వెంటనే వెనక్కి తీసుకువచ్చేలా ప్రభుత్వం మరింతగా కృషి చేయాలని కేటీఆర్ పేర్కొన్నారు.



## కార్మికులను కాపాడుకుంటాం

- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

ఎస్ఎల్‌బీసీ సొరంగంలో చిక్కుకున్న ఎనిమిది మంది. కార్మికులను కాపాడుకుంటామని, వారిని క్షేమంగా బయటకు తీసుకురావడానికి సర్వశక్తులు ఒడ్డుతున్నామని ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తవమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ప్రమాదం జరిగిన స్థలంలో నీరు లీక్ అవుతోందన్న మంత్రి. నీటి ఉధృతి కూడా పెరిగిందని రెస్క్యూ టీమ్స్ చెప్తున్నాయని చెప్పారు. మంగళవారం ప్రమాద స్థలంలో సహాయక చర్యలను మంత్రి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కీలక వ్యాఖ్యలు చేశారు. దేశంలో అత్యంత నిపుణులైన 10 ఏజెన్సీ లు ఈ రెస్క్యూలో పనిచేస్తున్నాయన్నారు. ఇండియన్ ఆర్మీ, ఇండియన్ నేవీ, ఎన్డీఆర్. ఫ్. ఎస్డీఆర్ఎఫ్, సింగరేణి, జియాజికల్ సర్వే 'ఆఫ్ ఇండియా, నేషనల్ రిమోట్ సెన్సింగ్ అన్నీ కలిసి పనిచేస్తున్నాయని తెలిపారు.


కొనసాగుతున్న సహాయక చర్యల గురించి సీఎం రేవంత్ రెడ్డి ఎప్పటికప్పుడు ఆరాతీస్తు న్నారని మంత్రి ఉత్తమ్ చెప్పారు ప్రమాదం జరిగిన వెంటనే వేగంగా స్పందించామని మంత్రి పేర్కొన్నారు. ఇలాంటి ప్రమాదాల్లో డెస్క్యూ ఆపరేషన్స్ చేసే అనుభవం ఉన్న వాళ్లను కూడా ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు కార్మికులను సురక్షితంగా బయటికి తీ సుకువచ్చేందుకు తాము శతవిధాలా ప్ర యత్నిస్తుంటే కొందరు చిల్లర రాజకీయం చేస్తున్నారని ఉత్తమ్ దుయ్యబట్టారు. గత ప్రభుత్వం చేపట్టిన కాళేశ్వరం నిర్మాణ సమయంలో ఏడుగురు చనిపోతే దాని గురించి తాము మాట్లాడలేదన్నారు. శ్రీశైలం పవర్ ప్లాంట్ లో కూడా ఎనిమిది మంది దీనిపోయినా రాజకీయం చేయలేదని చెప్పారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల తిరిగివ ప్రమానం దురదృష్టకరమని అభిప్రాయప డ్డారు. దేశంలోనే గొప్ప ప్రాజెక్టులైన ఎస్ఎ టీసీ టన్నెల్ 45 కి మీలలో 30 కిలోమీటర్లు పూర్తయ్యిందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. ప్రాజెక్ట్ పూర్తయితే నల్గొండ జిల్లాలో లక్షల ఎకరాలకు నీరు అందుతుందన్నారు. ఫ్లోరైడ్ బాధ కూడా తొలిగి పోతుం దన్నారు. బీఆర్ఎస్ హయాంలో 10 ఏళ్ల పాటు ప్రాజెక్షపనులు నిలిపివేశారని మంత్రి ఆరోపించారు.

మిగితా 2వ పేజీలో



ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబుతో కలిసి ఆస్ట్రేలియా క్వీన్స్‌ల్యాండ్ స్టేట్‌కు చెందిన ఉన్నతస్థాయి ప్రతినిధి బృందంతో సమావేశమయ్యారు. తెలంగాణలో ఉన్న సానుకూల వాతావరణం, పెట్టుబడులకు కల్పించిన అనుకూల పరిస్థితుల గురించి వారికి వివరించారు. తెలంగాణలో పరిశ్రమలు, స్పోర్ట్స్ యూనివర్సిటీ, ట్రేడింగ్, ఇతర రంగాల్లో పెట్టుబడులు, అవగాహనా ఒప్పందాల విషయంలో సమావేశంలో చర్చించారు. రాష్ట్రంలో పెట్టుబడులకు క్వీన్స్ ల్యాండ్ ప్రతినిధులు సానుకూలంగా స్పందించారు.ఈ చర్చల్లో క్వీన్స్‌లాండ్ గవర్నర్ డాక్టర్ జెన్నెట్ యంగ్ , క్వీన్స్‌ల్యాండ్ ఆర్థిక, వాణిజ్య, ఉపాధి, శిక్షణా శాఖ మంత్రి రోస్లిన్ బేట్స్‌తో పాటు ఇతర ప్రముఖులు, ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

## ముగిసిన ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రంలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం ముగిసింది. 22 రోజుల పాటు ఎమ్మెల్సీ అభ్యర్థులు, ఆయా పార్టీల మధ్య జరిగిన హెూరాహెూరీ ప్రచారానికి తెరపడింది. 48 గంటల ముందు ప్రచారం ఆపేయాలన్న ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మంగళవారం సాయంత్రం 4 గంటలకు ప్రధానపార్టీలు. అభ్యర్థులు ప్రచారాన్ని ముగించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పోలింగ్ ముగిసే వరకు ఆయా జిల్లాల్లో 'అమలులోకి రానుంది. 144 సెక్షన్ కూడా

ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో మద్యం దుకాణాలు మూతపడనున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి బహుముఖ పోటీ నెలకొనడంతో గెలుపు ఎవరిని వరిస్తుందో అని ఆసక్తికరంగా మారింది. ఈ నెల 3న రాష్ట్రంలో మూరు ఎమ్మెల్సీ స్థానాలకు నోటిఫికేషన్ విడుదలైంది. ఈ నెల 3 నుంచి 10వ తేదీ వరకు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు స్వీకరించారు. ఈనెల 8, 9 తేదీల్లో ప్రభుత్వ సెలవు కావడంతో ఫిబ్రవరి 11న నామినేషన్ల పరిశీలించారు. 13న నామినేషన జపసంహరణకు గడువు ముగిసింది. దాదాపు 25 రోజుల ప్రచారంలో బీజేపీ, కాంగ్రెస్, స్వతంత్ర అభ్యర్థులు గెలుపే లక్ష్యంగా ప్రచారంలో ససాగించారు. కాగా ఈ వబడు ఎమ్మెల్సీ పాటు కొనసాగిన ఎమ్మెల్సీ ఎన్నికల

పోలింగ్ ఈనెల 27న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4:00 వరకు జరగ నుండి. దీనికి సంబంధించి ఓట్ల లెక్కింపు మార్చి 3న జరుగనుంది. పోలింగ్‌కు మరో రోజే గడువు ఉండటంతో ప్రధాన పార్టీలు బలపరిచిన అభ్యర్థులు తమ వ్యూహాలకు పదును పెడుతున్నారు. మరోవైపు ఎమ్మె ల్సీ ఎన్నికల నిర్వహణకు అధికారులు ఇప్పటికే ఏర్పాట్లుపూర్తిచేశారు. వరంగల్ ఖమ్మం నల్గొండ నియోజకవర్గ పరిధిలో టీచర్స్ ఎమ్మెల్సీకి సంబంధించిన ఎన్నికల కోసం మొత్తం 200 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు నల్గొండ జిల్లా కలెక్టర్ తెలిపారు.

### పోటీలో 56 మంది..

మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ పట్టభద్రుల స్థానంలో 56 మంది పోటీలో ఉన్నారు. మొత్తం ఓటర్లు 3.41.313 మంది ఉండగా.. అందులో పురుషులు 2,18,060 మంది, మహిళలు 1,23,250 మంది, ఇతరులు ముగ్గురు, ఓటు హక్కును వినియోగించుకోనున్నా. రు. మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ పట్టభద్రుల నియోజకవర్గంలో టీచర స్థానంలో 15 మంది పోటీ ఉండగా. మొత్తం ఓటర్లు 25,921 మంది ఉన్నారు. అందులో పురుషులు 16,364 మంది. మహిళలు 9.557 మంది ఉన్నారు. వరంగల్, ఖమ్మం, నల్గొండ ఉపాధ్యాయ. నియోజకవర్గంలో 19 మంది పోటీలో మంది ఉన్నారు. అందులో పురుషులు 14.940 మంది, మహిళలు 9.965 మందిఉన్నారు.

## బీజేపీ టీమిండియా
# కాంగ్రెస్ పాకిస్థాన్

- ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీకి ఓటేయ్యండి
- కేంద్రమంత్రి బండి సంజయ్

వివరాలు 2వ పేజీలో



## రాష్ట్రంలో యూరియా కొరత లేదు

- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రంలో యూరియా కొరత లేదని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. ఒకటి రెండు చోట్ల జరిగిన ఘటనలను చూపిస్తూ రాష్ట్రంలో యూరియా కొరత తీవ్రంగా ఉన్నట్లుగా బీఆర్ఎస్ సోషల్ మీడియాలో ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. యూరియా కొరత వార్తలు సృష్టించడం ద్వారా రా జకీయంగా లబ్ది పొందాలనుకోవడం దురదృష్టకరమని మంగళవారం ఓ ప్రకటనలో

మిగితా 2వ పేజీలో

## ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసు మార్చి 4కు వాయిదా



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

కాంగ్రెస్‌లోకి ఫిరాయించిన తమ పది మంది ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించాలంటూ బిఆర్ఎస్ పార్టీ వేర్వేరుగా రెండు పిటిషన్లు దాఖలు చేసిన సంగతి విదితమే. ఈ పిటిషన్లపై విచారణ సందర్భంగా రీజనబుల్ టైం అంటే ఎంతో కచ్చితంగా చెప్పాలంటూ తెలంగాణ స్పీకర్‌ను కోరింది. ఫిరాయింపు ఎమ్మెల్యేలపై చర్యల కోసం రీజనబుల్ టైం కోసం స్పీకర్ ఎదురు చూస్తున్నారని అసెంబ్లీ కార్యదర్శి తరపు సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గి మరోసారి సుప్రీంకోర్టుకు వెల్లడించారు. అయితే సుప్రీంకోర్టు గత తీర్పుల ప్రకారం రీజనబుల్ టైమ్ అంటే మూడు నెలలు మాత్రమేనని బీఆర్ఎస్ వాదించింది. ఈ నేపథ్యంలో ఆ రీజనబుల్ టైం ఎంతో చెప్పాలంటూ కోర్టు తెలంగాణ స్పీకర్‌ను ప్రశ్నిస్తూ విచారణ వాయిదా వేసింది. మార్చి 4వ తేదీన బీఆర్ఎస్ పిటిషన్లపై జస్టిస్ బిఆర్ గవాయి, జస్టిస్ వినోద్ చంద్రన్ ధర్మాసనం మరోసారి విచారించనుంది.

తగిన సమయం, సరైన సమయం అంటూ స్పీకర్ చెబుతూ కాలయాపన చేయడంపైనా కోర్టు అభ్యంతరం వ్యక్తం చేసింది. మహారాష్ట్ర తరహాలో ఎమ్మెల్యేల పదవీకాలం ముగిసేదాకా ఆగుతారా? అంటూ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ పిటిషన్లపై పూర్తి వాదనలు విన్నాకే 'ఆ సరైన సమయం'పై తామే ఓ నిర్ణయం తీసుకుంటామని, అవసరమైతే స్పీకర్‌కు సూచనలు చేయడానికి ఉన్న అవకాశాలను కూడా పరిశీలిస్తామని పేర్కొంది. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు నుంచి ఎలాంటి నిర్ణయం వెలువడనుందనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. నిబంధనల ప్రకారం పార్టీ మారిన ఎమ్మెల్యేలకు స్పీకర్ నోటీసులు జారీ చేశారని గత విచారణలో అసెంబ్లీ కార్యదర్శి తరపు సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గి కోర్టుకు వెల్లడించారు. అయితే సుప్రీంకోర్టు జోక్యం తర్వాతే స్పీకర్ కార్యాలయం నుంచి నోటీసులు జారీ అయ్యాయని బీఆర్ఎస్ అంటోంది. కాగా, పార్టీ ఫిరాయించిన వారిపై స్పీకర్ నిర్ణయం తీసుకోకపోతే తామే కలుగజేసుకోవాల్సి ఉంటుందని వ్యాఖ్యానిస్తూ విచారణను మార్చి 4వ తేదీకి వాయిదా వేసింది.

# దారులన్నీ..ఎములాడకే..



- హర హర.. శివ శివ.. బోల శంకర..
- నేడు మహాశివరాత్రి పర్వదినం..
- పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రి పొన్నం, ప్రభుత్వ విప్ అది.
- పోలీసుల భారీ బందోబస్తు.





**బలగం టీవీ , వేములవాడ**

వేములవాడ రాజన్న ఆలయంలో మహాశివరాత్రి వేడుకలు మంగళవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. హర హర మహాదేవ.. శంభో శంకర అంటూ శివనామస్మరణతో ఆలయ పరిసరాలు మారు మోగుతున్నాయి. నిజామాబాద్, ఆదిలాబాద్, హైదరాబాద్ జిల్లాలతోపాటు మహారాష్ట్ర, ఛత్తీస్ గఢ్ రాష్ట్రాల నుంచి భక్తులు తరలివస్తున్నారు. ఎక్కడ ఖాళీ స్థలం కనిపిస్తే అక్కడే గుడారాలు,గుడి ఆవరణలో జాగరణ కోసం భక్తులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. మహాశివరాత్రి పర్వదినం సం దర్భంగా ఆర్జిత సేవలను రద్దు చేసిన ఆలయ అధికారులు లఘు దర్శనాలకు మాత్రమే అనుమ తించారు. రాజ న్న గుడి చెరువు ఖాళీ స్థలంలో సాంస్కృతికశాఖ ఆధ్వర్యంలో శివార్చనలో భాగంగా కళాకారులతో ప్రత్యేక కార్య క్రమాలు నిర్వహిస్తున్నారు.

### ఉచిత బస్సు సేవలు



దేవస్థానం తరపున ఉచిత బస్సు సర్వీసులను ఏర్పాటు చేశారు. ఈ సేవలను మంగళవారం ప్రభుత్వ విప్ ప్రారంభించారు. తిప్పాపూర్ బస్టాండ్ నుంచి బైపా స్రోడ్డు గుండా జగిత్యాల బస్టాండు, గుడిప్రాం తం, బైపాస్ రోడ్డు ద్వారా కోరుట్లబస్టాండు, ప్రాంతాలను కలు పుతూ తిరిగి తిప్పాపూర్ బస్టాండ్ వరకు చేరుకుంటాయి.

### పట్టువస్త్రాల సమర్పణ..

శ్రీరాజరాజేశ్వర స్వామి వారికి రాష్ట్ర ప్రభుత్వం తరుపున మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పట్టువస్త్రాలు సమర్పించారు. తిరుమల తిరుపతి దేవస్థానం తరపున ఆ ఆలయ అర్చకులు పట్టువస్త్రాలు సమర్పించారు.

### అన్నదానం.. మహాదానం

స్థానిక వాసవి సేవాసమితి. మన చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదానం కార్యక్ర మాన్ని ప్రభుత్వనిష్ ఆది శ్రీనివాస్ ప్రారంభించారు.



### జాతరను ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ..

జాతర ఏర్పాట్లను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఎస్పీ అఖిల్ మహాజన్ తో కలిసి పరిశీలించారు. భక్తులకు మెరుగైన సేవలందించాలని ఆదేశించారు.ఇక్కడ వేములవాడ ఆర్డీఓ రాజేశ్వర్, ఆలయ ఈఓ వినోద్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ అన్వేష్, తహశీల్దార్ మహేష్, ఈఈ రాజేష్, సీఐ వీరప్రసాద్, తదితరులు ఉన్నారు



## కార్మికులను కాపాడుకుంటాం

(మొదటి పేజీ తరువాయి)

ఎస్ఎల్ఏసీ ప్రమాదస్థలానికి 40 మీటర్ల దగ్గరి వరకు వెళ్తామని ఎన్డీఆర్ ఎఫ్ కమాండెంట్ ప్రసన్నకుమార్ వెల్లడించారు. సొరంగంలో చిక్కుకున్న 8 మందిని రాపా డేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నామన్నారు. టన్నెల్లో భారీ టీసీఎం మిషన్ ముక్కలుగా మారడంతో ఇబ్బందులు వస్తున్నాయని. టన్నెల్ ట్రెంజస్ ట్రాక్ పై బురదను తొలిగి స్తున్నామని సృష్టం చేశారు. సోమవారంతో పోలిస్తే మంగళవారం బురదిశగ్గిందన్నారు. ఉన్నెల్ లోన్ మిషన్లను పంపించినట్టు సన్నకుమార్ తెలిపారు స్వీపర్ దాగ్ స్క్వాడ్ ను కూడా లోపలికి తీసుకెళ్లామని. అయితే ఒక్కసారి అన్నెల్లో ప్రమాదం జరిగే ప్రాం దానికి వెళ్లి తిరిగి వచ్చేందుకు సుమారు గంటల సమయం పడుతుందని ఆయన వివరించారు.చిక్కుకున్న 8 మందిని రక్షించేందుకు సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. పలు మారుటన్నెల్లోకి వెళ్లిన రెస్క్యూ బృందాలు అక్కడి ప్రతికూల పరిస్థితులతో ముందు వెళ్లే పరిస్థితి లేక తిరిగి వచ్చాయి. ఎన్డీఆర్ ఎస్. ఎన్డీఆర్ఎస్. ఆర్మీ నేవీ, సింగరేణి, రాష్ట్ర విపత్తు నిర్వహణ బృందాలు సంయు కంగా ప్రయత్నిస్తున్నాయి. శ్రీశైలం ఎడమ గట్టు టన్నెట్ ప్రమాదంలో చిక్కుకున్న 8 మందిని బయటకు తెచ్చేందుకు సహాయక చర్యలు ముమ్మరంగా కొన సాగుతున్నాయి. ఎస్ఎల్బీసీ టన్నెల్ ప్రమాదంలో చిక్కుకున్న వారి కోసం దాదాపు 120 నుండి సిబ్బం పిప్పలవారీగా రాత్రి, పగలు లేకుండా వారిని రక్షించేందుకు ఆహర్నిశలు శ్రమిస్తున్నారు.

## రాష్ట్రంలో యూరియా కొరత లేదు

(మొదటి పేజీ తరువాయి)

పేర్కొన్నారు. రైతులకు సరిపడేంత యూరియా ఉందని, కానీ సోసైటీ తెరిచే సమయం కంటే ముందే అక్కడికి వచ్చిన కొంతమంది రైతులు పాస్ పుస్తకాలు, ఆధార్ కార్డులను వరుసలో ఉంచు తున్నారని తుమ్మల తెలిపారు. దాన్ని తమ స్వప్రయోజనం కోసం వీడియో తీసి సోషల్ మీడియాలో కొంత మంది నాయకులు కుటిల రాజకీయాల కోసం వాడుకొని రైతులను ఆందోళనకు గురిచేయడం బాధాకరమన్నారు. అగి త్యాలలో 890 యూరియా బస్తాలు అందుబాటులో ఉన్నాయని, అక్కడ వేచి ఉన్న రైతుల సంఖ్య 80 కూడాడా టరన్నారు. మహబూబాబాద్ జిల్లాలో యూరియా పంపిణీ కోసం పోలీసులు చేత టోకెన్లు జారీ చేశారనడం కూడా అవాస్తవమన్నారు. రైతాంగాన్ని అన వసరంగా ఆందోళనకు గురిచేయడం సరికాదన్నారు. గత యాసంగి కంటే ఈ యాసంగిలో ఇప్పటికే 1.91 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అధికంగా పంపిణీ చేశామని తుమ్మల తెలిపారు. రాష్ట్రంలో ఇంకా 1.14 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు ఉన్నాయని మంత్రి పేర్కొన్నారు. మరో 40 వేల టన్నుల యూరియా ఈ నెలలోనే పంపిణీ చేస్తున్నట్లు వివరించా రు మార్చి నెలలో కూడా లక్షా 80 వేల మెట్రిక్ టన్నులు యూరియా సరఫరాకు క)నికి ప్రతిపాదనలు పంపినట్లు మంత్రి వివరించారు. కేవలం వార్తల కోసం, పాస్ బుక్కులు లేదా చెప్పులు. లైన్లో పెట్టించి, యూరియా కొరత అనే వార్తలు సృష్టించడం ద్వారా రా జకీయంగా లబ్ది పొందాలనుకోవడం దురదృష్టకరమని మండిపడ్డారు. రైతాం గాన్ని ఆందోళన కలిగించే ఇటువంటి ప్రయత్నాలను మానుకోవాలని హితవు పలికారు. ఎక్కడైనా యూరియా సరఫరా లో పంపిణీలో నిజంగా సమస్య ఉంటే సంబంధిత వ్యవసాయాధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. యూరియా పంపించే బాధ్యత ప్రభుత్వం. తీసుకుంటుందని రైతాంగానికి తుమ్మల విజ్ఞప్తి చేశారు.

## బీజేపీ టీమిండియా కాంగ్రెస్ పాకిస్థాన్

- ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీకి ఓటేయ్యండి
- కేంద్రమంత్రి బండి సంజయ్

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

'ఇండియా గెలవాలంటే బీజేపీకి ఓటు వేయండి.. పాకిస్తాన్ గెలవాలంటే కాంగ్రెస్‌కు ఓటేయ్యండి' అంటూ కేంద్రమంత్రి బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. మంగళవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. బీజేపీ గెలిచి నిరుద్యోగ, ఉద్యోగ సమస్యలు తీర్చుతున్నాం. అల్ఫోర్స్ వార్షికోత్సవ సభలాగా నిన్నటి సీఎం రేవంత్ రెడ్డి మీటింగ్ ఉంది" అంటూ ఎద్దేవా చేశారు."బీఆర్ఎస్ కులగణనకు అనుకూలం. బీఆర్ఎస్ 51 శాతం బీసీ జనాభా, కాంగ్రెస్ చేస్తే 46 శాతం లెక్క.. ఎవరిది తప్పు.. ఎవరిది ఒప్పు..?. 12 శాతం ముస్లిం జనాభాకు, 10 శాతం రిజర్వేషన్ ఇస్తే.. 80 శాతం లాభం వారికే జరుగుతుంది. తెలంగాణ ఫోన్ ట్యాపింగ్, కారు రేస్ కేసుల్లో సీబీఐ విచారణ ఎందుకు కోరట్లేదు. సీబీఐ విచారణ కోరండి, మేము అరెస్టు చేస్తాం. ప్రభాకర్ రావు పారిపోయేందుకు సహకరించింది కాంగ్రెస్ పార్టీనే. కారు రేస్‌లో కేటీఆర్ హస్తం ఉందని కేబినెట్ మంత్రులు అన్నారు. మరి కేటీఆర్ కు ఎందుకు నోటీసు ఎందుకు ఇస్తలేరు?" అంటూ బండి సంజయ్ ప్రశ్నించారు. కేసీఆర్ హయాంలో జరిగిన విద్యుత్ కొనుగోలు అక్రమాలు విచారణ ఎందుకు బయట పెట్టడం లేదు..?. కేసీఆర్‌కు నోటీసు ఇచ్చే ధైర్యం కాంగ్రెస్‌కు లేదు. జన్వాడ ఫార్మ్ హౌస్ ఎందుకు కూల్చట్లేదు?. సీఎం రేవంత్ అరెస్టు అయింది.. జైల్లో ఉంది.. జన్వాడ కేసులోనే.. బీఅర్ఎస్, కాంగ్రెస్‌ది చీకటి ఒప్పందం. 15 వేల కోట్ల రూపాయలే మూసీ ప్రక్షాళన అంచనా. రాబర్ట్ వాద్రా కళ్లలో ఆనందం కోసమే రేవంత్ రెడ్డి తాపత్రయం. అధి నాయకురాలు అల్లుడి ఆనందం కోసం మూసీ ప్రక్షాళన అంచనా లక్ష కోట్లకు పెంచింది సీఎం రేవంతే. నోటిఫికేషన్ ఇచ్చింది కేవలం 20 వేల ఉద్యోగాల కోసమైతే.. 51 వేల ఉద్యోగాలు ఇచ్చామని అబద్ధాలు ఎలా చెబుతున్నారు..?" అని బండి సంజయ్ నిలదీశారు.


## నేడు ప్రధానితో సీఎం రేవంత్ రెడ్డి భేటీ

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రధానమంత్రి నరేంద్ర మోడీతో భేటీ కానున్నారు. . బుధవారం ఉదయం 10:30 గంటలకు సీఎం రేవంత్ రెడ్డి మంత్రి శ్రీధర్ బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) శాంతి కుమారి, ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంవో) కార్యదర్శి శేషాద్రి, రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) జితేందర్‌తో కలిసి ప్రధానిని కలవనున్నారు. పెండింగ్ లో ఉన్న పలు అంశాలపై ప్రదానితో ఈ భేటీలో చర్చించనున్నారు. కాగా, దీనికోసం రేవంత్ నేటి సాయంత్రం హైదరాబాద్ నుంచి విమానంలో ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు.

## మహాశివరాత్రి వేడుకలకు
# ముస్తాబైన శ్రీశ్రీశ్రీ త్రిలింగ సంగమేశ్వర స్వామి దేవాలయం





**బలగం టీవీ , బోయినిపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం విలాసాగర్ లోని శ్రీ శ్రీ శ్రీ త్రిలింగ సంగమేశ్వర స్వామి కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారంగా వెలుగొందుతున్న ఆలయం మహాశివరాత్రి వేడుకలకు ముస్తాబయింది. ఈనెల 26(నేడు) నుండి 28 వరకు జరిగే మహాశివరాత్రి వేడుకలకు అన్ని ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చలువ పందిళ్లు,త్రాగునీరు, విద్యుత్ లైట్లు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు గణపతి మాట్లాడుతూ: శివరాత్రి వేడుకలు మూడు రోజులు జరగనున్నట్లు తెలిపారు. ఈనెల 26 శివరాత్రి పర్వదినం పురస్కరించుకొని ఉదయం 8 గంటల నుండి రాత్రి 11 గంటల వరకు అభిషేకములు, అర్చనలు, కోడెలు కట్టుట నిర్వహించనున్నట్లు తెలిపారు. రాత్రి 11:30 కు లింగోద్భావ సమయంలో స్వామివారికి లఘున్యాస పూర్వక రుద్రాభిషేకము నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గురువారం రోజున సంగమేశ్వర స్వామి కళ్యాణంతో పాటు అన్నపూజ సాయంత్రం రథోత్సవం మహాలింగార్చన జరుపనున్నట్లు తెలిపారు. శుక్రవారం మహా యజ్ఞంతో కార్యక్రమాలు పూర్తయితయని తెలిపారు. కల్యాణోత్సవం రోజు అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కాగలరని కోరారు.

## అన్ని దానాల కన్నా అన్నదానం గొప్పది..
**-ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్,**

**బలగం టీవీ, వేములవాడ**



అన్ని దానాల కన్నా అన్నదానం గొప్పదని మహాశివరాత్రి జాతరకు వచ్చే భక్తులకు అన్నదానం చేయడం ప్రశంసనీయమని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు.మంగళవారం వేములవాడ వాసవి సేవాసమితి ,మన చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని భక్తులకు మూడు రోజులపాటు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించడం గొప్ప విషయం అని అన్నారు. అన్నదాన కార్యక్రమానికి సహకరించిన దాతలకు, నిర్వాహకులకు అభినందనలు తెలిపారు.

## విధులను పక్కాగా నిర్వహిస్తూ
# ప్రశాంతంగా ఓటింగ్ జరిగేలా చూడాలి

**-ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌ను పకడ్బందీగా నిర్వహించాలి..**

**- కలెక్టర్ సందీప్ కుమార్ ఝ**

**బలగం టీవీ , సిరిసిల్ల**



శాసనమండలి ఎన్నికల పోలింగ్ జిల్లాలో పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝ అన్నారు.మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లాలోని చందుర్తి, కోనరావు పేట మండల కేంద్రాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో, వేములవాడ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆర్డీఓ రాజేశ్వర్ తో కలిసి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ పోలింగ్ సజావుగా జరిపేందుకు వీలుగా పోలింగ్ కేంద్రాలలో అవసరమైన అన్ని సౌకర్యాలు ఉండాలని, సీసీ కెమెరాలు లేదా వెబ్ కాస్టింగ్ తప్పనిసరిగా ఉండాలని అధికారులకు సూచించారు. జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరికి ఓటర్ స్లిప్ పంపిణీ చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఫిబ్రవరి 27న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు శాసనమండలి ఎన్నికల పోలింగ్ జరుగుతుందని అన్నారు. పోలింగ్ కేంద్రం పరిసరాలను చెక్ చేసుకోవాలని ,100 మీటర్ల రేడియస్ లో ఎన్నికలను ప్రభావితం చేసేలా ఎటువంటి ప్రచారం జరగడానికి వీలు లేదని అన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద డమ్మీ బ్యాలెట్ అతికించాలని అన్నారు.

పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు లైన్లో వచ్చేందుకు ఏర్పాట్లు చేయాలని, దివ్యాంగులు వృద్ధులు గర్భిణీ స్త్రీలు ప్రాధాన్యతతో ఓట్లు వేసే విధంగా చూడాలని, 100 మీటర్ల పరిధిలో ఓటర్ సహాయ కేంద్రానికి హెల్ప్ డెస్క్ లు ఏర్పాటు చేయాలని అన్నారు. పోలింగ్ లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు పాస్పోర్ట్ డ్రైవింగ్ లైసెన్స్ పాస్ బుక్ , పాన్ కార్డు ఆధార్ కార్డు, పెన్షన్ డాక్యుమెంట్, జాతీయ ఉపాధి హామీ పథకం జాబ్ కార్డ్, యూడి ఐడి, హెల్త్ ఇన్సూరెన్స్ స్మార్ట్ కార్డు గుర్తింపు కోసం ఓటర్లు తమ వెంట తీసుకుని రావాల్సి ఉంటుందని అన్నారు. పోలింగ్ నాడు ఉదయం ఖాళీగా ఉన్న బ్యాలెట్ బాక్స్ ను ఏజెంట్లకు చూపించాలని, గ్రీన్ పేపర్ లో ఏజెంట్ల సంతకాలు తీసుకుని సీజ్ చేయాలని, బ్యాలెట్ బాక్స్ పై పోలింగ్ కేంద్రం వివరాలు ఉండే విధంగా పేపర్ అతికించాలని, ఓటర్ సీక్రసి కాపాడేందుకు వీలుగా ఓటింగ్ కంపార్ట్మెంట్లను ఏర్పాటు చేయాలని అన్నారు.

పోలింగ్ నాడు ప్రతి రెండు గంటలకు ఒకసారి అంటే 10 గంటలకు, 12 గంటలకు, 2 గంటలకు, పోలింగ్ ముగిసిన తరువాత 4 గంటలకు పోలింగ్ వివరాలను ప్రకటించాలని అన్నారు. సాయంత్రం నాలుగు గంటల వరకు ఓటర్ స్లిప్పులు ఇచ్చిన ప్రతి ఒక్కరికి ఓటు వేసే అవకాశం కల్పించాలని, అన్నారు. చివరి ఓటర్ ఓటు వినియోగించుకున్న తర్వాత నిబంధనలు ప్రకారం బ్యాలెట్ బాక్సులను మూసివేసి సీల్ చేయాలని, ప్రతి ఒక్క సిబ్బంది తన మాన్యువల్ ను ఒకటికి రెండు సార్లు పరిశీలించు కోవాలని , విధులను పక్కగా నిర్వహిస్తూ ప్రశాంతంగా ఓటింగ్ జరిగేలా చూడాలని అన్నారు. అనంతరం కోనరావుపేట మండలం వెంకట్రావు పేట గ్రామంలోని ఇసుక రీచ్ ను పరిశీలించారు. ఇక్కడ తహసిల్దార్లు విజయ్ ప్రకాష్ రావు , మహేష్, సుజాత, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ టీచర్ పై పోక్సో కేసు..

**-చందుర్తి సి.ఐ వేముకటేశ్వర్లు**

**బలగం టీవీ వేములవాడ**

విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన టీచర్ కనపర్తి బ్రమ్మం పై పోక్సో చట్టం క్రింద కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించినట్లు చందుర్తి సీఐ వేంకటేశ్వర్లు ఓ ప్రకటనలో తెలిపారు.

కొనరావుపేట మండలం పల్లె నిజామాబాద్ గ్రామంలోని జడ్పిహెచ్ఎస్ పాఠశాల లో పోలీస్ అక్క కానిస్టేబుల్ మహిళ చట్టాలపై, షీ టీమ్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించగా కొంత మంది విద్యార్థులు పోలీస్ అక్క వద్దకు వచ్చి కనపర్తి బ్రమ్మం అనే టీచర్ కొద్ది రోజులుగా క్లాస్ రూమ్ లో విద్యార్థునుల పట్ల బ్యాడ్ టచ్ చేస్తూ అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడాని ఫిర్యాదు చేశారు.వెంటనే స్పందించిన పోలీస్ అక్క పిర్యాదు మెరకు టీచర్ కనపర్తి బ్రమ్మం పై ఫోక్సో చట్టం క్రింద కేసు నమోదు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేశారు. అనంతరం నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.



## పోలింగ్ కేంద్రాల వద్ద సిబ్బందితో పటిష్ట బందోబస్తు...

**-పోలింగ్ కేంద్రాల వద్ద 163 బీఎన్ఎస్ఎస్ యాక్ట్ (144 సెక్షన్) అమలు..**

**- ఎస్పీ అఖిల్ మహాజన్**

**బలగం టీవీ, సిరిసిల్ల**

ఈ నెల 27న జరగనున్న ఉపాధ్యాయ,పట్టభద్రుల ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా స్వేచ్ఛాయుత వాతవరణంలో ఎన్నికలు జరిగేలా పోలీస్ శాఖ పటిష్టమైన చర్యలు తీసుకోవడం జరిగిందని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. సిరిసిల్ల,తంగలపల్లి, చందుర్తి పోలీస్ స్టేషన్ల పరిధిలోని పలు పోలింగ్ కేంద్రాలను ఎస్పీ అఖిల్ మహాజన్ తనిఖీ చేశారు.పోలింగ్ కేంద్రాల వద్ద తీసుకోవలసిన భద్రత చర్యల మీద అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ ఈనెల 27 వ తేదీన జరుగు ఉపాధ్యాయ,పట్టభద్రుల ఎన్నికల సందర్భంగా 200 మంది పోలీస్ సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు.జిల్లాలో ఏర్పాటు చేసిన 41 పోలింగ్ కేంద్రాలో 23,347 మంది ఓటర్లు తమ ఓటు హక్కును ప్రశాంత వాతావరణంలో వినియోగించుకునేల పోలింగ్ పక్రియ మొదలు నుండి పూర్తి అయ్యేవరకు పోలింగ్ కేంద్రాల వద్ద అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. జిల్లాలోని పోలీస్ కేంద్రాల వద్ద అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 163 బిఎన్ఎస్ ఆక్ట్ (144 సెక్షన్) అమలులో ఉంటుందని, 100 మీటర్ల, 200 మీటర్ల పరిధిలో ఆంక్షలు ఉంటాయని,ఎవరైనా చట్ట విరుద్ధంగా ప్రవర్తించిన, గొడవలు సృష్టించాలని చూసిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఇన్స్పెక్టర్ కృష్ణ,రూరల్ సి.ఐ మొగిలి, చందుర్తి సిఐ వెంకటేశ్వర్లు, సిబ్బంది ఉన్నారు.

## హైదరాబాద్ జూపార్క్‌లో పెరగనున్న ధరలు

**బలగం టీవీ, హైదరాబాద్**



హైదరాబాద్‌లోని నెహ్రూ జంతు ప్రదర్శనశాలలో టిక్కెట్ ధరలు పెరగనున్నాయి. ఈ మేరకు పార్కులో జరిగిన జూస్ అండ్ పార్క్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ 13వ గవర్నరింగ్ బాడీలో కీలక నిర్ణయం తీసుకున్నారు. పెరిగిన ధరలు ఏప్రిల్ 1 నుండి అమల్లోకి వస్తాయని నెహ్రూ జూపార్క్ క్యురేటర్ జె.వసంత ఈరోజు ఒక ప్రకటనలో వెల్లడించారు. ఇకపై జూపార్కు సందర్శనకు ప్రవేశ రుసుము పెద్దలకు రూ.100, పిల్లలకు రూ.40 చొప్పున వసూలు చేయనున్నారు. ఫొటో కెమెరాకు అనుమతి ఇస్తే రూ.150, వీడియో కెమెరా రూ.2,500, సినిమా చిత్రీకరణ కోసం రూ.10 వేలు ఛార్జిని వసూలు చేయనున్నారు.

జూపార్కులో రైలు ప్రయాణానికి పెద్దలకైతే రూ.80, పిల్లలకైతే రూ.40గా నిర్ణయించారు. బ్యాటరీ ఆపరేటెడ్ వాహనం ఎక్కితే పెద్దలకు రూ.120, పిల్లలకు రూ.70 చొప్పున నిర్ణయించారు. సఫారీ పార్కు డ్రైవ్ సీఎన్జీ బస్సు 20 నిమిషాలకు ఏసీ అయితే రూ.150, నాన్–ఏసీ అయితే రూ.100 చొప్పున వసూలు చేయనున్నారు. 11 సీట్లు కలిగిన కొత్త బ్యాటరీ ఆపరేటెడ్ వాహనం 60 నిమిషాలకు రూ.3,300, 14 సీట్ల బీవోవీ ఎక్స్‌క్లూజివ్ వాహనం అయితే రూ.4,000 వసూలు చేయనున్నారు. వాహనాల పార్కింగ్ విషయానికి వస్తే సైకిల్‌కు రూ.10, ద్విచక్ర వాహనం రూ.30, ఆటో రూ.80, కారు లేదా జీపు అయితే రూ.100, టెంపో లేదా తూఫాన్ అయితే రూ.150, 21 సీట్లు కలిగిన మినీ బస్సు రూ.200, 21 సీట్లు కలిగిన బస్సుకు రూ.300 చొప్పున ధరను నిర్ణయించారు.

# ఆస్ట్రేలియా-సౌతాఫ్రికా మ్యాచ్ వర్షార్పణం



**బలగం టీవి, హైదరాబాద్**

ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ 2025లో భాగంగా ఆస్ట్రేలియా-సౌతాఫ్రికా మధ్య జరగాల్సిన మ్యాచ్ వర్షార్పణమైంది. ఎడతెరిపిలేకుండా కురిసిన వర్షం కారణం ఒక్క బంతి పడకుండానే ముగిసింది. దాంతో ఇరు జట్లకు అంపైర్లు చెరో పాయింట్ కేటాయించారు. దాంతో గ్రూప్-బీలో సౌతాఫ్రికా, ఆస్ట్రేలియా మూడేసి పాయింట్స్‌తో టాప్-2లో కొనసాగుతున్నాయి. తమ తదుపరి మ్యాచ్‌ల్లో విజయం సాధిస్తే సెమీఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసుకోనున్నాయి. తమ చివరి లీగ్ మ్యాచ్‌ల్లో అఫ్ఘనిస్థాన్‌తో ఆస్ట్రేలియా.. ఇంగ్లండ్‌తో సౌతాఫ్రికా తలపడనున్నాయి. శుక్రవారం ఆస్ట్రేలియా-ఆఫ్ఘనిస్తాన్ మధ్య, శనివారం దక్షిణాఫ్రికా-ఇంగ్లాండ్ మధ్య జరిగే మ్యాచులు జరుగనున్నాయి. ఇంగ్లాండ్-ఆఫ్ఘనిస్తాన్ జట్లు సెమీస్‌కు అర్హత సాధించాలంటే రెండు మ్యాచుల్లోనూ తప్పనిసరిగా గెలవాల్సిందే.

గ్రూప్-బీ టాపర్‌గా ఉన్న సౌతాఫ్రికా.. సెమీఫైనల్ చేరాలంటే.. ఇంగ్లండ్‌తో జరిగే చివరి లీగ్ మ్యాచ్‌లో విజయం సాధించాలి. అప్పుడు ఎలాంటి సమీకరణం లేకుండా సెమీఫైనల్‌కు అర్హత సాధిస్తోంది. ఓడితే మాత్రం.. ఇతర జట్ల ఫలితాలపై ఆధారపడాల్సి ఉంటుంది.

గ్రూప్-బీలో రెండో స్థానంలో కొనసాగుతున్న ఆస్ట్రేలియా సెమీఫైనల్ చేరాలంటే.. అఫ్ఘనిస్థాన్‌తో జరిగే మ్యాచ్‌లో విజయం సాధించాలి. అప్పుడు ఎలాంటి సమీకరణం లేకుండా సెమీఫైనల్‌కు అర్హత సాధిస్తోంది. ఓడితే మాత్రం.. ఇతర జట్ల ఫలితాలపై ఆధారపడాల్సి ఉంటుంది. సౌతాఫ్రికా చేతిలో ఇంగ్లండ్, ఇంగ్లండ్ చేతిలో అఫ్ఘనిస్థాన్ ఓడిపోవాలి. అప్పుడే మూడు పాయింట్లతో సెమీస్‌కు అర్హత సాధిస్తోంది.

ఓటమితో ఈ టోర్నీని ప్రారంభించిన ఇంగ్లండ్.. అఫ్ఘాన్, సౌతాఫ్రికాతో జరిగే తమ చివరి రెండు లీగ్ మ్యాచ్‌ల్లో విజయం సాధించాలి. ఒక్క మ్యాచ్ ఓడినా టోర్నీ నుంచి నిష్క్రమిస్తోంది.

అఫ్ఘనిస్థాన్‌ది కూడా ఇదే పరిస్థితి. ఆ జట్టు సెమీఫైనల్ చేరాలంటే ఇంగ్లండ్, ఆస్ట్రేలియాను ఓడించాలి. అప్పుడే 4 పాయింట్లతో సెమీస్ చేరుతోంది.





# విరాట్‌పై పాంటింగ్ ప్రశంసల జల్లు

**బలగం టీవి, హైదరాబాద్**

భారత్ స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీపై ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ రికీ పాంటింగ్ ప్రశంసల వర్షం కురిపించాడు. విరాట్ ఆల్ టైం బెస్ట్ వన్డే బ్యాటర్ అని కితాబులిచ్చాడు. తాజాగా పాంటింగ్ మాట్లాడుతూ.. " కోహ్లీ చాలా కాలంగా ఛాంపియన్ ఆటగాడు. ముఖ్యంగా వైట్-బాల్ ఫార్మాట్లలో అతని నమ్మశక్యం కాని విధంగా ఉంది. విరాట్ టాప్ వన్డే ఆటగాడు. విరాట్ కోహ్లీ కంటే మెరుగైన 50 ఓవర్ల ఆటగాడిని నేను ఎప్పుడూ చూడలేదు. ఇప్పుడు అతను నన్ను దాటేసి మరో ఇద్దరి వెనుక ఉన్నాడు. సచిన్ కంటే కోహ్లీ 4,000 పరుగులు వెనుకబడి ఉన్నాడు. ఇప్పుడే రికార్డ్ గురించి ఆలోచించడం కరెక్ట్ కాదు". అని అన్నాడు.

# గుజరాత్‌పై ఢిల్లీ ఘన విజయం


**బలగం టీవి, హైదరాబాద్**

డబ్ల్యూపీఎల్ 2025 సీజన్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ మరో విజయాన్ని నమోదు చేసింది. గుజరాత్ జెయింట్స్‌తో మంగళవారం జరిగిన మ్యాచ్‌లో ఢిల్లీ 6 వికెట్ల తేడాతో గెలుపొందింది. ముందుగా బ్యాటింగ్ చేసిన గుజరాత్ జెయింట్స్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లకు 127 పరుగులు చేసింది. భార్తీ ఫుల్మాలి(29 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లతో 40 నాటౌట్) ఒంటరి పోరాటం చేయగా.. డియాంద్ర డాటిన్(24 బంతుల్లో 5 ఫోర్లతో 26) పర్వాలేదనిపించింది. మిగతా బ్యాటర్లు దారుణంగా విఫలమయ్యారు. ఢిల్లీ బౌలర్లలో శిఖా పాండే, మరిజన్నే కాప్, అన్నబెల్ సదర్లాండ్ రెండేసి వికెట్లు తీయగా.. టిటస్ సదు, జెస్ జోనాస్సెన్ తలో వికెట్ పడగొట్టారు.

అనంతరం ఢిల్లీ క్యాపిటల్స్ 15.1 ఓవర్లలోనే 4 వికెట్లకు 131 పరుగులు చేసి గెలుపొందింది. జెస్ జోనాస్సెన్(32 బంతుల్లో 9 ఫోర్లు, 2 సిక్స్‌లతో 61 నాటౌట్) హాఫ్ సెంచరీతో సత్తా చాటగా.. షెఫాలీ వర్మ(27 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్స్‌లతో 44)దూకుడుగా ఆడింది.



గుజరాత్ బౌలర్లలో కేశ్వీ గౌతమ్ రెండు వికెట్లు తీయగా.. అష్లే గార్డ్‌నర్, తనూజ కన్వార్ తలో వికెట్ పడగొట్టారు. ఈ విజయంతో ఢిల్లీ క్యాపిటల్స్ పాయింట్స్ టేబుల్‌లో అగ్రస్థానంలో నిలిచింది.



# జపాన్‌లో 'దేవర'..

- **ప్రమోషన్స్ ప్రారంభించిన ఎన్టీఆర్**

**బలగం టీవి, హైదరాబాద్**

జూనియర్ ఎన్టీఆర్ నటించిన బ్లాక్ బస్టర్ చిత్రం దేవం. కొరటాల శివ దర్శకత్వం వహించిన ఈ మూవీ రెండు పార్టులుగా తెరకెక్కుతుండగా.. దేవర పార్టు 1 గతేడాది సెప్టెంబర్ 27న థియేటర్లలో ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదలై సూపర్ హిట్ టాక్ తెచ్చుకుంది. ఇప్పుడు ఇదే చిత్రం జపాన్‌కి వెళుతుంది. ఎన్టీఆర్ చిత్రాలకు జపాన్‌లో మంచి క్రేజ్ ఉందన్న విషయం తెలిసిందే. ఇప్పటికే అక్కడ విడుదలైన బాద్‌షాతో పాటు ఆర్‌ఆర్‌ఆర్ చిత్రాలు మంచి కలెక్షన్లు సాధించాయి. ఈ నేపథ్యంలోనే దేవర సినిమా జపాన్‌లో మార్చి 28న గ్రాండ్‌గా విడుదల కాబోతుంది. ఈ సందర్భంగా ఇప్పటినుంచే ప్రమోషన్స్ స్టార్ట్ చేశాడు తారక్. ఇందులో భాగంగానే జపాన్ అభిమానులు, అక్కడి మీడియాతో వర్చువల్ ఇంటర్వ్యూలో పాల్గొన్నాడు. దీనికి సంబంధించిన ఫోటోలను దేవర టీమ్ తన అధికారిక ట్విటర్ ఖాతాలో షేర్ చేసింది. మరోవైపు దేవర ప్రమోషన్స్‌లో భాగంగా మార్చి 22న జపాన్‌కి వెళ్లనున్నాడు ఎన్టీఆర్.

# నవ్విస్తున్న మ్యాడ్ స్క్వేర్' టీజర్

**బలగం టీవి, హైదరాబాద్**




2023లో వచ్చిన 'మ్యాడ్' మూవీకి సీక్వెల్‌గా వస్తున్న 'మ్యాడ్ స్క్వేర్' టీజర్ తాజాగా విడుదలైంది. జూనియర్ ఎన్టీఆర్ బావమరిది నార్నె నితిన్, రామ్ నితిన్, సంగీత్ శోభన్ ప్రధాన పాత్రల్లో నటిస్తోన్న ఈ చిత్రంపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలే ఉన్నాయి. మార్చి 29న ఈ సినిమా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో తాజాగా టీజర్‌ను రిలీజ్ చేశారు. ముగ్గురు హీరోలు మరోసారి తమ కామెడీతో కితకితలు పెట్టారు. మొత్తంగా టీజర్ కామెడీ, ఎంటర్‌టైన్మెంట్‌తో అదిరిపోయింది.కళ్యాణ్ శంకర్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాకు భీమ్స్ సిసిరోలియో బాణీలు అందిస్తున్నారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్, శ్రీకర స్టూడియోస్ బ్యానర్స్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. టీజర్ చూస్తుంటే.. లడ్డుగాని పెళ్లి స్టోరీతో ఈ సినిమా రాబోతున్నట్లు తెలుస్తుంది. లడ్డుగాని పెళ్లికి వచ్చిన గ్యాంగ్ బ్యాచిలర్ పార్టీఅని గోవాకి వెళతారు. ఆ క్రమంలోనే అక్కడ ఏం జరిగింది అనేది స్టోరీ అని తెలుస్తుంది. ఇక మ్యాడ్ సినిమాలో వన్ లైనర్స్ కామెడీతో అలరించిన చిత్రబృందం ఇందులో కూడా అలాగే నవ్వించబోతున్నట్లు తెలుస్తుంది.

# 'మజాకా'కు సీక్వెల్ ఆలోచన ఉంది : నిర్మాత రాజేష్

**బలగం టీవి, హైదరాబాద్**

సందీప్ కిషన్ నటించిన 'మజాకా'కి ధమాకా మేకర్ త్రినాధరావు నక్కిన దర్శకత్వం వహించారు.ఈ చిత్రాన్ని ఎకె ఎంటర్‌టైన్‌మెంట్స్, హాస్య మూవీస్ బ్యానర్స్‌పై రాజేష్ దండా నిర్మిస్తున్నారు. బాలాజీ గుత్తా సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఈ మాస్ ఎంటర్‌టైనర్‌లో రీతు వర్మ హీరోయిన్. మన్మధుడు ఫేమ్ అన్షు, రావు రమేష్ కీలక పాత్రలు పోషించారు. ఈ హైలీ ఎంటర్‌టైనింగ్ మూవీ శివరాత్రి కానుకగా బుధవారం థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ సందర్భంగా నిర్మాత రాజేష్ దండా విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ "మజాకా మంచి ఎంటర్‌టైనర్. ఫ్యామిలీ సినిమా. డైరెక్టర్ త్రినాధ్ రావు, రైటర్ ప్రసన్న స్టయిల్‌లో వుండే మాస్ ఎంటర్‌టైనర్. -మజాకా ఖచ్చితంగా చాలా మంచి సినిమా అవుతుంది. మంచి ఎంటర్‌టైన్‌మెంట్, ఫ్యామిలీ ఎమోషన్ వున్న సినిమా. ఇంటర్వెల్‌కి మంచి ట్విస్ట్ వుంటుంది. అది సెకండ్ హాఫ్‌ని ఎలా లీడ్ చేస్తోందో చాలా ఆసక్తికరంగా వుంటుంది. మంచి ఎంటర్‌టైన్‌మెంట్ ఉన్న టైటిల్ పెట్టాలని అనుకున్నాం.మజాకా టైటిల్ పర్ఫెక్ట్ అనిపించింది. త్రినాధ్ రావు నక్కినతో వర్క్ చేయడం అద్భుతమైన అనుభవాన్నిచ్చింది. సినిమాని అద్భుతంగా తీశారు. ఆయనతో మరో సినిమా చేయాలని వుంది. ఇదే సినిమాకి సీక్వెల్ చేయాలని ఆలోచన వుంది. సినిమా చివరలో డబుల్ మజాకా అనే టైటిల్ కూడా వేశాం. ఇందులో ఎంటర్‌టైన్‌మెంట్‌తో పాటు మంచి మెసేజ్ కూడా వుంది. ఇద్దరు బ్యాచిలర్స్ వాళ్ళ ఇంట్లో ఒక ఫ్యామిలీ ఫోటో పెట్టుకోవాలని తపన పడతారు. అది సినిమాలో బ్యూటీఫుల్ ఎమోషన్"అని అన్నారు.

# ట్రెండింగ్‌లో 'శివా శివా శంకరా'

**బలగం టీవి, హైదరాబాద్**



మంచు విష్ణు కన్నప్ప పాత్రలో నటిస్తున్న చిత్రం కన్నప్ప. ఇటీవల ఈ సినిమా నుంచ్చి వచ్చిన శివా శివా శంకరా' అనే పాట సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ శివరాత్రికి అన్ని చోట్లా ఈ పాటే మార్మోగిపోయేలా ఉంది. ఇప్పటికే ఈ పాట సోషల్ మీడియాలో ఎన్నో రికార్డులు క్రియేట్ చేస్తోంది. ఇప్పటికే ఈ పాటను 80 మిలియన్ల (8 కోట్ల) మంది వీక్షించారు. ఇక ఇన్ స్టాగ్రాంలో రెండు లక్షలకు పైగా రీల్స్ చేశారు. అన్ని వర్గాల ప్రేక్షకుల్ని ఈ పాట ఆకట్టుకుంది.ఇక సోషల్ మీడియా మొత్తం శివ నామస్మరణే కనిపిస్తోంది. అంతటా శివా శివా శంకరా' అనే పాటే వినిపిస్తోంది.మహా శివరాత్రి సందర్భంగా ఈ పాట మరింతగా ట్రెండ్ అవుతోంది. ఈ పాట అద్భుతమైన విజయం సాధించడం గురించి నటుడు-నిర్మాత మంచు విష్ణు మాట్లాడుతూ... "శివా శివా శంకరా పాటకు వచ్చిన అద్భుతమైన స్పందన చూసి మేం చాలా సంతోషిస్తున్నాం. ప్రజలు దానిని స్వీకరించిన విధానం, రీల్స్ చేస్తూ తమ తమ భక్తిని ప్రదర్శిస్తుండటం ఆనందంగా ఉంది. ఇంతలా ఈ పాట ట్రెండ్ అవుతుందని మేం ఊహించలేదు. శివరాత్రి వస్తున్నందున ఈ పాట మరింత ఉన్నత స్థాయికి చేరుకుంటుందని అర్థమవుతోంది" అని అన్నారు. ఈ మూవీ ఏప్రిల్ 25న గ్రాండ్‌గా రిలీజ్ కాబోతోంది.